క్లుప్తంగా

రవిని పరామర్శించిన జేపీ



రవిని పరామర్శిస్తున్న జేపీ

ఏలూరు టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న 17వ డివిజన్‌కు చెందిన రాళ్లపల్ల రవిని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ పరామర్శించారు. బుధవారం ఆయన నివాసానికి వెళ్లి రవితో మాట్లాడారు. రవి త్వరగా కోలుకోవాలని, మెరుగైన చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు జాన్ గుర్నాథ్, కిలాడి దుర్గారావు, దాసరి రమేష్, తంగెళ్ల రాము, కొల్లిపాక సురేష్, గాజుల బాజీ, మల్లిక్, మద్దాల ఫణి, సుబ్బరాజు, సుజన్, ఘంటా రాజేశ్వరరావు, దాలి వెంకటేష్, గణేష్, మాధవ్, అబ్బాయి, సేనాపతి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జయంతి

ఏలూరు(మెట్రో): స్థానిక కలెక్టరేట్‌లో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుక నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి, నగరపాలక సంస్థ కో ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్టీఆర్ చరిత్రపై ఫొటో ప్రదర్శన ఆకట్టుకున్నాయి. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో 'యోగాంధ్ర'



వ్యాయామం చేస్తున్న చిన్నారులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఫస్ట్ సెక్టార్ లంకపేట-2 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పిల్లలతో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ బి.మంగ ఈ సందర్భంగా కిషోర బాలికలకు రక్తహీనతను గురించి, పౌష్టికాహారం గురించి వివరించారు. బాలికలకు ఈ వయస్సులో సరైన పోషణ లేకపోతే రక్తహీనత కలుగుతుందన్నారు. తద్వారా బాలికల్లో ఆశించిన స్థాయిలోఎదుగుదల ఉండదన్నారు. దీన్ని అధిగమించేందుకు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

- వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి ఇంటిలోనూ పథకాల పండుగ
- నేడు సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం
- వార్డు హెల్త్ క్లినిక్‌ల సేవల్లోనూ నిర్లక్ష్యం
- ఏలూరు నగర వాసుల్లో నైరాశ్యం



వార్డు సచివాలయం, వెంకటాపురం



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): నాడు వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో ఏలూరు నగరంలోని ప్రతి పేద కుటుంబం ఆనందంతో కళకళ లాడింది. నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే పేద కుటుంబాల్లో నిరాశ, నిస్పృ, నైరాస్యం రాజ్య మేలుతున్నాయి. తెల్లవారక ముందే లబ్ధిదారులను ఆప్యాయంగా పలుకరించి పింఛన్ సొమ్ము అందించే వలంటీర్ల సేవలు లేవు. దీంతో ప్రజలు తమ వ్యక్తి గత పనుల కోసం అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన వస్తోంది. కూటమి ప్రభుత్వం వార్డు హెల్త్ క్లినిక్‌లలో పనిచేసే సీహెచ్‌ఓలను సమస్యల సుడిగుండంలో నెట్టేస్తోంది.

వలంటీర్లపై కక్ష సాధింపు

ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 88,366 ఇళ్లు, 66,075 రేషన్ కార్డులు ఉన్నాయి. క్లస్టర్‌లు 1484, డివిజన్‌లు 50 ఉన్నాయి. 79 వార్డు సచివాలయాలు ఉండగా, వీటి పరిధిలో 1,434 మంది వలంటీర్లు పనిచేసే వారు. వీరిని కొనసాగిస్తామని, నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం అందిస్తామని ఎన్నికల సమయంలో నమ్మబలికిని కూటమి పార్టీల నాయకులు అధికారంలోకి వచ్చాక వలంటీర్ల వ్యవస్థనే రద్దు చేశారు. చిరు ఉద్యోగులైన వలంటీర్లపై కక్ష సాధింపుకు దిగి వారిని దూరం పెట్టారు.

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యానికి కుట్ర

వైఎస్సార్ సీపీ హయాంలో అన్ని రకాల సేవలు ప్రజల ఇంటి ముంగిటే అందించేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేశారు. ప్రతి సచివాలయంలో 8 నుంచి 10 మంది సిబ్బందిని నియమించారు. దాదాపు 89 రకాల సేవలను అందించేవారు. దీంతో అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి తప్పింది. తాజాగా కూటమి ప్రభుత్వం సచివాలయాల స్థానంలో క్లస్టర్ల ఏర్పాటు చేసి, సచివాలయాలను నగానికి కుదించే కుట్ర చేస్తోంది.

రోడ్డెక్కిన సీహెచ్‌ఓలు

మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యసేవలు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వార్డు హెల్త్ క్లినిక్‌లపైనా ప్రభుత్వం రాజకీయ కుట్ర చేస్తోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖలో అన్ని కేడర్‌లను ఒక రకంగా సీహెచ్‌ఓలను మరో రకంగా చూడటం, వారికి ఇవ్వాల్సిన ఇన్సెంటివ్‌లను సకాలంలో ఇవ్వకపోవడం, పీఎఫ్ వంటివి జమ చేయకపోవడం వంటి రాజకీయ కుట్రలకు పాల్పడుతుందనే విమర్శలు వస్తున్నాయి. దీంతో ఇటీవల దాదాపు నెల రోజుల పాటు సీహెచ్‌ఓలు రోడ్డెక్కి నిరవధిక సమ్మె చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలతో వారు సమ్మెను విరమించి తిరిగి విధుల్లోకి చేరారు.

నగర పాలక సంస్థలో వలంటీర్ల వివరాలు..		
డివిజన్‌లు	:	50
సచివాలయాలు	:	79
వలంటీర్లు	:	1,434
ఇళ్లు	:	88,366
రేషన్ కార్డులు	:	66,075

వేతనాలు లేవు



నగరపాలక సంస్థలో పని చేస్తున్న వార్డు వలంటీర్లకు గత ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. విధుల్లోకి తీసుకోవడంలేదు. గతంలో ఇచ్చిన రూ.5 వేలు గౌరవ వేతనం అయినా చెల్లిస్తే మా కుటుంబాలకు ఆసరాగా ఉంటుంది. రాజకీయాల ముసుగులో మమ్మల్ని పక్కన బెట్టడం ఎంత వరకు సమంజసం.

– బి.పద్వీరాజు,వలంటీర్, లంకపేట,59 సచివాలయం,ఏలూరు

సేవలకు దూరం

గతంలో వలంటీర్లుగా మేం ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు ఇచ్చే పింఛన్లను దగ్గరుండి తమ పరిధిలో ఉన్న ప్రజలకు క్రమం తప్పకుండా అందే విధంగా చర్యలు తీసుకునేవారం. అన్ని ప్రభుత్వ పథకాలను వారికి అందేలా చూసేవారం. అలాంటి మమ్మల్ని విధులకు దూరం పెట్టడం బాధాకరం. తక్షణం మమ్మల్ని విధుల్లోకి తీసుకోవాలి.

– ఎస్‌కే బాషా, వలంటీర్, ఫిలౌస్‌పేట, 56వ సచివాలయం, ఏలూరు

70 శాతం మహిళా వలంటీర్లే

ఏలూరు కార్పొరేషన్‌లో పనిచేసే వార్డు వలంటీర్లలో 70 శాతం వరకు మహిళలమే ఉన్నాం. ఇచ్చే రూ.5 వేల గౌరవ వేతనం గత 7 నెలల నుంచి లేకపోవడంతో మా కుటుంబాలు బతికేందుకు నానా అవస్థలు పడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం మా బాధలు అర్థం చేసుకుని విధుల్లోకి తీసుకోవాలి. బకాయి వేతనాలు చెల్లించాలి.

– పి.మమత, వలంటీర్, వెంకటాపురం, 6వ సచివాలయం, ఏలూరు

కక్ష సాధింపు



గ్రామ, వార్డు వలంటీర్లకు గత 7 నెలలుగా వలంటీర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వలంటీర్ల వేతనాలు తక్షణం విడుదల చేయాలి. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ల వేతనాలు నెలకు రూ.10 వేలకు పెంచాలి. చిరుద్యోగుల పట్ల కక్షసాధింపు తగదు.

– ఆర్.లింగరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు జిల్లా

ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలి

ఏలూరు (టూటౌన్): ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల దౌర్జన్యంతో పెదవేగి మండలం కె.కన్నాపురం గ్రామానికి చెందిన కమిలి భాస్కరరావు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. భాస్కరరావు ఆత్మహత్యతో అతని కుటుంబం రోడ్డున పడిందని తెలిపారు. భాస్కరరావు తన ఇంటి నిర్మాణానికి మహేంద్ర ఫైనాన్స్ కంపెనీ నుంచి తీసుకున్న అప్పు చెల్లించడంలో ఆలస్యం అవ్వడంతో రికవరీ ఏజెంట్లు అతనిపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడం వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి ఆత్మహత్యకు పాల్పడే విధంగా దోహదం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, సంబంధిత కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భాస్కరరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రజలను ఇబ్బందులు పాలు చేసే ఇలాంటి ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టి వారి లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వాడపల్లికి ప్రత్యేక బస్సు సర్వీసు

జంగారెడ్డిగూడెం: వాడపల్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తుల సౌకర్యార్థం ప్రతి శనివారం ప్రత్యేక సర్వీసు నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. లక్కవరం, ఎ.కొత్తపల్లి, దూబచర్ల, నల్లజర్ల పరిసర గ్రామాల నుంచి వాడపల్లి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈనెల 31 నుంచి జంగారెడ్డిగూడెంలో ఉదయం 04.30 గంటలకు, తిరిగి వాడపల్లిలో మధ్యాహ్నం 13.00కి బయలుదేరి జంగారెడ్డిగూడెం వస్తుందని తెలిపారు.

రూ.10 వేల వేతనం ఇవ్వాలి

టి.నరసాపురం: సీనియర్ మేట్లకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనుల ప్రదేశాలను నాయకులు సందర్శించి కూలీలతో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడారు.

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి



పత్తేబాద రైతు బజారులో కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రైతుబజార్లలో ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకే కాయగూరలు విక్రయించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వ్యాపారులకు సూచించారు. స్థానిక పత్తేబాదలోని రైతుబజార్‌ను బుధవారం రాత్రి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కాయగూరల ధరలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుబజార్లలో వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా దృక్పథంతో వినియోగదారులకు సేవలందించాలని వ్యాపారులకు సూచించారు. తాజా కాయగూరలను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మాలన్నారు. అధిక ధరలకు విక్రయించకుండా ఎస్టేట్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతుబజార్లో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. రైతుబజార్లలో పరిశుభ్రత పాటించాలని, టాయిలెట్లు కూడా శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మరమ్మత్తులకు గురైన పత్తేబాద రైతు బజార్లోని టాయిలెట్‌ను వెంటనే పునర్నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుబజారులో కలెక్టర్ స్వయంగా కాయగూరలు కొని, వాటి ధరలు రైతులకు చెల్లించారు. కలెక్టర్ వెంట ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖాధికారులు, రైతుబజార్ ఎస్టేట్ అధికారి, పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



మాట్లాడుతున్న మలేరియా అధికారి గోవిందరావు

ఏలూరు టౌన్: బిడ్డలు రోగాలబారిన పడకుండా ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిదండ్రులు నిర్ణీత సమయంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. బుధవారం ఏలూరులోని జ్వాలాపహరేశ్వరస్వామి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు క్షయ, పోలియో, రోటా వైరస్, కోరింత దగ్గు, రుబెల్లా, న్యుమోనియా లాంటి వాటికి ఉచితంగా వేస్తామని తెలిపారు. యూపీహెచ్‌సీ జేపీ కాలనీ వైద్యాధికారి డాక్టర్ నీలిమ, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సబ్ స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. పోణంగి సబ్ స్టేషన్ పరిధిలో వైఎస్ఆర్ కాలనీ, పోణంగి రోడ్డు, వీఎస్ఆర్ గ్రాండ్ సిటీ, రాజరాజేశ్వరి నగర్, శ్రీరామ్ నగర్‌కాలనీ, పోణంగి, ఈనమ్మగుంట, జగనన్న కాలనీ, మరడాని రంగారావు కాలనీ, జాలిపూడి ఫీడర్‌లో కొమడవోలు, హమాలీ కాలనీ, దుర్గ గ్రాండ్ సిటీ, ఆండాళ్లమ్మ తోట, రామ్ నగర్, మస్తాన్ మన్యం కాలనీ, శాస్త్రి కాలనీ, చెంచుల కాలనీ, ఆటోనగర్, కొమరవోలు, తూర్పులాకులు, సాయినగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వెంకన్న చెరువు సబ్‌స్టేషన్ పరిధిలో కత్తేపు వీధి, కొత్తగూడెం సెంటర్, గుప్తా ఎంటర్ ప్రైజెస్ ప్రాంతం, వెంకన్న చెరువు ప్రాంతం, మార్కండేయ స్వామి దుడి ప్రాంతం, ప్రేమాలయం ప్రాంతం, పెదమాలపల్లి, తూర్పు వీధి, గంగానమ్మ గుడి ప్రాంతం, ఫిల్‌హౌస్‌పేట, చాటపర్రు రోడ్డు, ఏడు కాలువల సెంటర్, కొత్తగూడెం, మోటేపల్లి వారి వీధి, మేకా వారి వీధి, కబేళా ప్రాంతం, తూర్పువీధి శివాలయం ప్రాంతం, సాయిబాబా గుడి ప్రాంతం, జ్వాలాపరమేశ్వర కాలనీ, దక్షిణపు వీధి, ఆశోకచక్రం రోడ్డు, పోణంగి రోడ్డు, అరుంధతి పేట, పడమర వీధి, దొంగల మండపం రోడ్డు, పాలతూము సెంటర్, శనగపప్పు బజారు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	34	బీరకాయలు	--
వంకాయలు (తెలుపు)	34	చామదుంపలు	50
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	44	బీట్‌రూట్	36
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	107
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	06
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	10
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	13
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - తిరుపతి	16.00	4830	28

ఏలూరు నగరం.. స్వచ్ఛత ప్రశ్నార్థకం



అశోక్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్త



ఎఫ్‌సీఐ గోడౌన్స్ ఎదురుగా ఇది పరిస్థితి

స్వచ్ఛాంధ్ర అంటూ హడావుడి చేస్తారు. ఫొటోలకు ఫోజులిచ్చి హమ్మయ్యా అయిపోయిందనుకుంటారు. కాని జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో ఏ వీధి చూసినా చెత్తతో నిండి, తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. కోవిడ్ వస్తుందని, జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారులు చెబుతున్నా నగరపాలక సిబ్బంది మాత్రం చెత్త తరలింపుపై శ్రద్ధ చూపడంలేదు. రోజూ చెత్త తీసి మమ్మల్ని రోగాలను నుంచి కాపాడాలని నగర ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు



కబాడీగూడెంలో పేరుకుపోయిన చెత్త



కొత్తపేటలో దుర్గంధం వెదజల్లుతున్న చెత్త



పత్తేబాద పార్కు వద్ద పేరుకుపోయిన చెత్త

హామీల అమలు కోరుతూ 2న ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల శేఖర్

ఏలూరు (టూటౌన్): అర్హులందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ కోటేశ్వరరావు, ఆవుల శేఖర్‌లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా సమితి సమావేశం ఏలూరు స్ఫూర్తి భవనంలో బుధవారం నిర్వహించారు. కోటేశ్వరరావు, శేఖర్‌లు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు పక్కాగా అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా హామీల అమలుపై మాట్లాడటం లేదని ఆరోపించారు. గతంలో చంద్రబాబు వన సంరక్షణ సమితులను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. నేడు అటవీ భూముల్లో వన సంరక్షణ సమితులు ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, చింతలపూడి, టి.నరసాపురం, జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, ఏలేరుపాడు, కుక్కునూరు, నూజివీడు ప్రాంతాల్లో ఉన్న అటవీ భూములను అక్కడి గిరిజన కుటుంబాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఉపాధి హామీలో చేసిన పనికి సక్రమంగా డబ్బులు ఇవ్వాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జూన్ 10న భారతీయ కేత్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రాల వద్ద నిర్వహించే ప్రదర్శనలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు, జిల్లా ఉపాధ్యక్షులు గోలిమి బాలయేసు, కంచర్ల గురవయ్య, గొర్రెలు, మేకలు పెంపకం దారుల రాష్ట్ర అధ్యక్షులు పొట్టిల పెంటయ్య, మడిమి కామయ్య, కొక్కిరపాటి ఆనంద్ , తాడిగడప జయరాజు, కురసం సూర్యచంద్రరావు తదితరులు మాట్లాడారు.

సారా రహిత జిల్లాకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలత

చింతలపూడి: సారా రహిత ఏలూరు జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏలూరు డిప్యూటీ కమిషనర్ శ్రీలత అన్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సారా, మాదక ద్రవ్యాలు ఆరోగ్యాన్ని నాశనం చేయడంతో పాటు, కుటుంబాలను కూడా వీధిన పడేస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ నాటు సారా, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలతో నాటుసారా నిర్మూలనకు ప్రమాణం చేయించారు. నాటుసారా తయారీ, అమ్మకాలు చేసే వారు వాటిని మానుకోవాలని, అలా చేసిన వారికి ప్రత్యామ్నాయంగా సంబంధిత శాఖల ద్వారా లోన్‌లు ఇప్పించేలా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఈఓ ఎ.ఆవులయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ సీహెచ్ అజయ్‌కుమార్‌సింగ్, ఈఎస్‌టీఎఫ్ ఏఈఎస్ జి.పాండురంగారావు, ఎక్సైజ్ సీఐ పి.అశోక్, చింతలపూడి పోలీసు సీఐ రాజ్‌కుమార్, పోలీసు ఎస్సై కుటుంబరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వైవీఎస్ఎస్ ఫణికుమార్, నాగిరెడ్డిగూడెం ప్రజలు పాల్గొన్నారు.

- నాగిరెడ్డిగూడెంకు చెందిన ఇస్లావతు చిన్ని, వదిత్యా పార్వతి, వదిత్యా కుమారిలను చింతలపూడి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి

టి.నరసాపురం: ఏఎస్ఆర్ నగర్ నివాసులకు విద్యుత్, నీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. సీపీఎం టి.నరసాపురం మండల కమిటీ సమావేశం పరగడ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. రవి మాట్లాడుతూ ఏఎస్ఆర్ నగర్ ఏర్పడి 17 సంవత్సరాలయ్యిందని, నేటికి అక్కడ విద్యుత్, మంచినీటి సౌకర్యం లేదని తెలిపారు. హైకోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ అక్కడ మౌలిక వసతులు కల్పించకపోవడం బాధాకరమన్నారు. పార్టీ మండల కార్యదర్శి మడకం సుధారాణి, సభ్యులు గుడెల్లి వెంకట్రావు, మడకం కుమారి, మొండ్రు శిరీష, బరగడ కుమారి, అనుమోలు మురళి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత రవి